## చిన్నకథ

# తోడు



ఆఫీసు నుంచి బయటపడి, నడుస్తూ టైం చూసుకున్నా. రాత్రి ఎనిమిది. 'అబ్బో! .... చాలా టైమైంది' అనుకున్నా. అనుకోవడమే తడవు అడుగులు వడివడిగా పడసాగాయి. ఆఫీసులో లేట్ అవర్స్‌లో వుండి పని చేయడం అలవాటే గాని, ఈ రోజు కొంచెం చిరాగ్గా వుంది. అసలే వేసవి. ఒకటే చెమట చీదర... సాయంత్రం టీ కూడా తాగలేదేమో... తల దిమ్ముగా వుంది. ఈ రోజు ఆఫీసులో అంతా ఆరుకే వెళ్లిపోయారు. తనకే కుదరలేదు. ఒంటరిగా అర కిలోమీటరు దూరంలో వున్న జంక్షన్ కెళ్లి, మా కాలనీ బస్సు పట్టుకోవడం అంటె చిరాకే మరి....

అనుకోకుండానే, ఆఫీసు పక్కనే వున్న క్వార్టర్స్ మెయిన్‌గేటు దగ్గరి కొచ్చేశాను. నా దృష్టి అప్రయత్నం గానే, గేటు లోకి పడింది. దానికి కారణం వుంది. ఇలా ఆలస్యం అయినప్పుడు ఒక్కోసారి క్వార్టర్స్‌లో వుండే ఏ కొలీగో ఏ బజారుకో వెళుతూ కనిపించడం... కబుర్లు చెబుతూ జంక్షన్ దాకా, కంపెనీ ఇవ్వడం... ఒక్కోసారి ఏ బైక్ మీదో లిఫ్ట్ ఇవ్వడం మామూలే!

ఆతృతగా చూసిన నాకు, గిరి నడిచి వస్తూ కనిపించాడు. తెల్లటి లాల్చీ, మల్లెపూవు లాంటి తెల్లటి లుంగీ... దగ్గరికొస్తుంటే, అప్పుడే స్నానం చేసాడేమో... వాడిన సబ్బు తాలుకూ గంధపు పరిమళం...

గిరిని చూసేక నాకు ఎక్కడ లేని నిరుత్సాహం వచ్చేసింది. అదే ఏ మూర్తో, నాయరో అయితే ఖచ్చితంగా జంక్షన్ దాకనో, కనీసం ముందుగా వచ్చే కరాచీ స్టోర్స్ సెంటర్ దాకానో కంపెనీ ఇచ్చేవారు ఆ మాటా, ఈ మాటా మాట్లాడుతూ. కాని గిరి నుండి అలాంటివి ఆశించలేం.

గిరి గురించి కొంచెం చెప్పాలి. అతను ఆఫీసులో 'పేరు మోసిన పిసినారి! అంటే ఒక్క డబ్బు ఖర్చు చేయడంలోనే అనుకుంటే పొరపాటే! అన్ని విషయాల్లోనూ అంతే తను. ఆఖరుకి ఆఫీసు పని కూడా అలా అలా ఏదో చేసేసి బయటపడే రకం. ఏదీ తనకు ప్రయోజనం లేందే చేయడు.

ఒకటి రెండుసార్లు ఇలా సాయంత్రం వేళల్లో క్వార్టర్స్ దగ్గర ఎదురుపడ్డ గిరిని "అంతదాక సర్దాగా రండి" అని అన్నా, "పనుంది" అని నిర్మొహమాటంగా తిరస్కరించాడు. అతను కనిపించగానే కలిగిన నిరుత్సాహానికి నేపథ్యం ఇదే.

కాని చిత్రంగా అతనే, "పదండి" అంటూ నాతో నడవడం మొదలెట్టాడు. నడకలో బోరు కొట్టకుండా, తోడు దొరికినందుకు హుషారుగా నడవ సాగాను.

కరాచీ స్టోర్స్ సెంటర్ వచ్చింది. అక్కడ గిరి ఆగిపోతాడనుకున్నా. తర్వాత మరో రెండు ఫర్లాంగుల దూరం ఒంటరిగా నడవక తప్పదనుకున్నా. కాని అతను అగిపోలేదు. నాతో నడుస్తూనే వున్నాడు.

'హమ్మయ్య! ... జంక్షన్ వరకు కంపెనీ దొరికింది' అనుకున్నా.

జంక్షన్ వచ్చేసింది. గిరి సిగ్నల్ లైట్లకి పక్కగా మల్లెపూల దుకాణం దగ్గర ఆగిపోయాడు హఠాత్తుగా.

"మల్లె పూల కోసం" అన్నాడు అదో మాదిరి నవ్వుతూ. కాలేజీ రోజుల్లో కవిత్వం గిలికిన వాణ్ణి కాబట్టి, గిరి 'మల్లెపూలు' అని అనగానే ఒక్కసారిగా ఎగిసిన రొమాంటిక్ ఫీలింగ్‌తో హృదయం రెపరెపలాడింది నాకు. కాని వెంటనే, గిరి వచ్చింది, నాకు కంపెనీ ఇవ్వడం కోసం కాదన్న మాట... మల్లెలు కొనడం కోసమన్న మాట... అయినా నా పిచ్చిగాని, ఏదో పని లేకపోతే, ఇంత దూరం ఊరికే వచ్చే రకమా తను?... ఒక రకంగా నేనే అతనికి కంపెనీ ఇచ్చానన్న మాట!... నవ్వుకున్నాను.

ఇంతలో కరాచీ సెంటర్లో గంగరావి చెట్టు కింద వున్న పూల కొట్టు సంగతి గుర్తు కొచ్చి, మల్లెల్ని అక్కడే కొని వుండొచ్చు కదా... అని అనుకుని, అదే విషయాన్ని అతన్ని అడిగా.

"అక్కడ మూర నాలుగు రూపాయలు... ఇక్కడ మూడున్నరే!...." అన్నాడు గిరి.

'అదీ! సంగతన్నమాట!' నువ్వుకున్నాను.

మరుసటి రోజు ఉదయం ఆఫీసు కాంటీన్లో ఓ మూలగా కూర్చున్నాం గిరీ, నేను. నాకెందుకో గత రాత్రి మల్లెల సంగతి గుర్తు కొచ్చి.... "రాత్రి బాగా ఎంజాయ్ చేసి వుంటారు" కన్ను గీటుతూ అన్నాను గిరితో చనువుగా.

గిరి మొహం అదోలా పెట్టాడు. బహుశా అలాంటి ప్రైవేటు విషయం గురించి ప్రస్తావించడం ఇష్టం లేక కాబోలు! నేను 'సారీ' అని అనే లోగానే, అతనే అన్నాడు... "మల్లెపూల వాసన దేముడెరుగు.. నీకు తోడుగా అంతదూరం నడిచివచ్చి, తిరిగొచ్చేసరికి ఒళ్ళంతా చెమట పట్టి, అంతకు ముందే స్నానం చేసినా, ఒకటే చెమట కంపు... మా ఆవిడ కసలే ఆ కంపెంటే ఎలర్జీ.... ఇక ఇంతే సంగతులు!" నీకు తోడుగా వచ్చినందువల్లే ఇలా జరిగిందన్న నిష్ఠూరం అతని స్వరంలో.

'నువ్వు నాకు తోడు రావడం సంగతి అలా వుంచు... నిన్ను ఎప్పుడూ వదలని 'తోడు' నీ పిసినారితనమే!'... అని అందామనుకున్నా గాని, అన్లేదు.

– ఎస్.హనుమంతరావు

చిరునామా:
ఎస్.హనుమంతరావు
సి 5/6, దూరదర్శన్ స్టాఫ్ క్వార్టర్స్,
రామంతపురం, హైదరాబాద్ – 500 013.